క్లుప్తంగా

తాతా సందీప్‌కు డాక్టరేట్



పీహెచ్‌డీ అందుకుంటున్న సందీప్ శర్మ

సీటీఆర్ఐ: నగరానికి చెందిన ప్రముఖ శతావధాని తాతా సందీప్ శర్మకు బయోటెక్నాలజీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్ లభించింది. జెనెటిక్స్ విభాగ ఆచార్యులు, ప్రస్తుత ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పర్యవేక్షణలో మాలిక్యులర్, ఫిజియోలాజికల్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ డ్రాట్ స్ట్రెస్ రిలేటెడ్ ట్రాన్స్‌క్రిప్షన్ ఫ్యాక్టర్స్ అండ్ ఇన్ సిలికో ఎనాలసిస్ ఫర్ క్రిస్పర్ క్యాస్ మీడియేటెడ్ జీనోమ్ ఎడిటింగ్ ఇన్ రైస్ అనే అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా సందీప్ బుధవారం డాక్టరేట్ స్వీకరించారు.

లేపాక్షిలో 31 వరకూ థీమాటిక్ ఎగ్జిబిషన్



లేపాక్షి ఎంపోరియంలో హస్తకళా వస్తువులు

సీటీఆర్ఐ: లేపాక్షి ఎంపోరియంలో ఈనెల 19న ప్రారంభమైన థీమాటిక్ ఎగ్జిబిషన్‌కు అద్భుత స్పందన లభిస్తోందని లేపాక్షి నగర సంస్థ మేనేజర్ మోనిక అన్నారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 31 వరకూ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ ఎం.బాలసుబ్రహ్మణ్యంరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తయారీదారులే నేరుగా తాము తయారు చేసిన హస్తకళా వస్తువులను ఈ ఎగ్జిబిషన్‌లో విక్రయిస్తారన్నారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, కలంకారి, వైట్‌వుడ్, ఏలూరు కార్పెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. లేపాక్షి ఎంపోరియంలో వస్తువులకు 10 నుంచి 40 శాతం డిస్కౌంట్ ఉందన్నారు.

ఎస్‌కేఆర్‌ను సందర్శించిన నాక్ బృందం



ఉమెన్స్ కళాశాలను పరిశీలిస్తున్న నాక్ బృందం

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలను గురువారం నాక్ బృందం పరిశీలించింది. నాక్ పర్యవేక్షణ బృందం చైర్ పర్సన్ పి.నారాయణస్వామి పాపన్న, ప్రొఫెసర్ గీతారాణి ప్రకాశం, డాక్టర్ ధనరాజ్ శెట్టి బృందం కళాశాలను పూర్తిగా పరిశీలించింది. ఈ బృందం రెండు రోజుల పాటు కళాశాలలోని అన్ని విభాగాలను, మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించి ఆ నివేదికను నాక్ బోర్డుకు సమర్పిస్తుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి, ఐక్యుఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి, నాక్ కో ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.సునీత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మపై జనసేన ప్రచారం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మపై జనసేన ప్రచారం

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల కోడ్ వచ్చినప్పటికీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మలపై జనసేన పార్టీ నేతల ప్రచార బోర్డులు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తులపై ఎటువంటి ప్రచారాలూ ఉండకూడదని ఎన్నికల అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణలోకి రావడం లేదు. బొమ్మూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర నగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మపై జనసేన పార్టీ పెయింటింగ్ ఇలా కనిపించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దానిని తొలగిస్తారో లేదో వేచి చూడాలి.

ఆకుల వీర్రాజు పరామర్శ

కడియం: కడియపులంకలో రావిపాటి మహాలక్ష్మి కుటుంబ సభ్యులను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు గురువారం పరామర్శించారు. మహాలక్ష్మి మృతికి సంతాపం తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

ప్రగతి పథం.. అభివృద్ధే ధ్యేయం

- రూరల్ డివిజన్లలో సమస్యలకు మోక్షం
- ప్రజల హర్షం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్‌గా మంత్రి వేణుగోపాలకృష్ణ బాధ్యతలు చేపట్టిన 50 రోజుల్లోనే అనేక పనులు చేపట్టారు. ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి వేణుగోపాలకృష్ణ శ్రీకారం చుట్టడంతో పాటు, ఆ పనులను వేగవంతంగా అమలు చేశారు.

శరవేగంగా..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని ఎనిమిది డివిజన్లలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఐఎల్‌టీడీ జంక్షన్ ఫ్లైఓవర్ నుంచి బాలాజీపేట వరకూ ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా, శంభూనగర్ రైతుబజార్ వద్ద ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు ఒకవైపు పూర్తయింది. 18వ డివిజన్‌లోని కొండావారివీధి, ఆనపాలవారివీధిలలో కల్వర్టుల నిర్మాణం జరిగింది. 17వ డివిజన్‌లోని ఐటీసీఎల్‌లో దీర్ఘకాలంగా ఉన్న ముంపు సమస్యను పరిష్కరించడంతో పాటు, అపార్టుమెంట్ల మధ్య చప్టాల నిర్మాణ పనులు సైతం మొదలయ్యాయి. శిథిలావస్థకు చేరిన పైపు లైన్లను మార్చి కొత్తవి వేస్తున్నారు. 16వ డివిజన్‌లో ఎండోమెంట్ వాంబే కాలనీ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో పాటు ప్రధాన సీసీ రోడ్డు పనులు చివరి దశలో ఉన్నాయి. అలాగే వివిధ డివిజన్లలో డ్రైనేజీల నిర్మాణం వేగంగా జరుగుతోంది. డివిజన్లలో వేగవంతంగా నిర్మాణ పనులు జరుగుతుండడంతో.. శిలాఫలకాలకే పరిమితం అని వ్యాఖ్యానించిన ప్రతిపక్ష నేతలకు సైతం మింగుడుపడడం లేదు. డివిజన్లలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఇచ్చిన మాట ప్రకారం పరిష్కరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ నిబద్ధతపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎండోమెంట్ వాంబే కాలనీలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు



ఆనపాలవారివీధిలో నిర్మించిన మూడు కల్వర్టులు



శంభూనగర్ రైతుబజార్ వద్ద పూర్తయిన కల్వర్టు



ఐఎల్‌టీడీ ఫ్లై ఓవర్‌పై నిర్మించిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

సమస్యల పరిష్కారం

నగరపాలకసంస్థ పరిధిలోని డివిజన్లలో సమస్యలు శరవేగంగా పరిష్కారమవుతున్నాయి. మంత్రి వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– పదమటి నాగమణి, 18వ డివిజన్, రాజమహేంద్రవరం

జవాబుదారీతనంతో ఎన్నికల విధులు

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని రాజమండ్రి రూరల్ నియోజకవర్గం–51 రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయంలోనూ, వైటీసీ ప్రాంగణంలోనూ ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్వో తేజ్ భరత్ మాట్లాడుతూ ఎన్నికల పర్యవేక్షణ కేంద్రాలు, పోస్టల్ ఓటింగ్ కేంద్రం, ఎన్నికల కోసం సమావేశాలు నిర్వహించేందుకు కాన్ఫరెన్స్ రూమ్, సివిజిల్, ఎంసీసీ, సువిధ తదితర కేంద్రాలను పరిశీలించారు. సహాయ రిటర్నింగ్ అధికారులు వైవీకే అప్పారావు, రమాదేవి పాల్గొన్నారు.



వివిధ విభాగాలను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి తేజ్ భరత్

పోలింగ్‌బూత్ పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: నియోజక వర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులూ ఉండేలా చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. కోలమూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ)లో ఏర్పాటు చేసిన 40వ నంబర్ పోలింగ్ బూత్‌ను అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ స్థాయి అధికారి పేరు, ఫోన్ నంబర్ అందుబాటులో ఉంచాలని, ఆ మేరకు అక్కడ గోడపై స్పష్టంగా రాయించాలన్నారు. పోలింగ్ కేంద్రం పరిధిలో 85 ఏళ్లు దాటిన ఓటర్లు, 40 శాతం పైబడిన దివ్యాంగుల ఓటర్ల వివరాలు సేకరించి, హోం ఓటింగ్ కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తహసీల్దార్ వైకేవీ అప్పారావు, జిల్లా సహకారశాఖ అధికారి వై.ఉమామహేశ్వరరావు, బీఎల్‌వో కె.నిఖిత పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రాజమహేంద్రవరం రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని రాజానగరం ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి అన్నారు. పోషణ్ పక్వాడ ఉత్సవాలలో భాగంగా బొమ్మూరు జేఎన్‌బీ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ ఆధ్వర్యంలో గురువారం గర్భిణులకు సీమంతం, ఆరు నెలల నిండిన పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. సీడీపీవో నాగమణి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువ కలిగిన ఆహారం గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బేబీరాణి పాల్గొన్నారు.

హుకుంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసనలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బొమ్మూరులో గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీవో నాగమణి

ముగిసిన బైబిల్ మిషన్ మహాసభలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం సెయింట్ పాల్స్ సెర్చ్ గ్రౌండ్‌లో జరిగిన బైబిల్ మిషన్ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. మూడో రోజు గురువారం జరిగిన ముగింపు సమావేశంలో బైబిల్ మిషన్ ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ ఎస్.వి జయరాజు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో జరుగుతున్న బైబిల్ మిషన్ పుట్టింటి మహాసభలకు మన రాష్ట్రంతో పాటు తెలంగాణ నుంచి కూడా పెద్ద సంఖ్యలో విశ్వాసులు వచ్చారన్నారు. ఏసుక్రీస్తు అందరికీ ప్రభువు అని, ఆయన బోధనలను అనుసరించి జీవించాలన్నారు. బైబిల్‌లోని మర్మాలను ప్రజలకు తెలియజేసేందుకే మంగమూరి దేవదాసు అయ్యగారు బైబిల్ మిషన్‌ను రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేశారు. తన తండ్రి స్వర్గీయ సుదర్శన్‌రావు నగరంలో ప్రారంభించిన ఈ మహాసభలు విజయవంతంగా సాగుతున్నాయన్నారు. మహాసభలకు సహకరించిన కేథడ్రల్, గోల్డెన్ జూబ్లీ, స్వస్థతశాల సంఘ పెద్దలకు, విశ్వాసులకు అభినందనలు తెలిపారు. సుందర శామ్యూల్, డి.శామ్యూల్ స్వరూప్, శామ్యూల్ కిరణ్ వాక్యోపదేశాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ షాలేము రాజు, సెక్రటరీ పీజే సుధాకర్, జాయింట్ సెక్రటరీ డి.సువర్ణ రాజు, డాక్టర్ ఎస్.సిమ్యోన్ సుదర్శన్, ఎన్.విలియం బెంటిక్, ఎస్.ఉషారాణి, స్వర్ణకుమారి పాల్గొన్నారు.



బైబిల్ మిషన్ మహాసభలో మాట్లాడుతున్న విజయరాజు

23 మంది వలంటీర్ల తొలగింపు

రాజమహేంద్రవరం సిటీ: నగర పరిధిలో ప్రజా ప్రతినిధులు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న 23 మంది వార్డు వలంటీర్లను తొలగించినట్లు రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ గురువారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన ఈనెల 16వ నుంచి వలంటీర్లు రాజకీయ పార్టీల కార్యక్రమాలలో పాల్గొనకూడదన్నారు. వాటిని ఉల్లంఘించిన 23 మంది వలంటీర్లను తక్షణం విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. వీరిలో 44వ డివిజన్ పరిధి 76 సచివాలయానికి 10 మంది, 77వ సచివాలయానికి చెందిన 13 మంది ఉన్నారన్నారు.

వీధులను శుభ్రం చేసిన వలంటీర్లు

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీలోని వీధులను సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురువారం శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.సుధామయి ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపులో భాగంగా నాలుగు రోజు ఈ కార్యక్రమం నిర్వహించారు. అలాగే గ్రామ ప్రజలకు ఆరోగ్యం, ఆహారం, పరిశుభ్రత, పచ్చదనం, గ్లోబల్ వార్మింగ్, వర్షాభావం, అతివృష్టి, అనావృష్టి, ఎయిడ్స్, క్యాన్సర్ వంటి తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ స్థానిక బ్రాంచ్ మేనేజర్ కె.సతీష్ మాట్లాడుతూ గ్రామీణ మహిళలకు, స్కూల్ పిల్లలకు బ్యాంకు అందించే వివిధ పథకాలను వివరించారు. చిరు వ్యాపారస్తులకు ముద్ర పథకంలో ఎటువంటి హామీలు లేకుండా రూ.2 లక్షల రుణం అందిస్తున్నామన్నారు. అదే విధంగా పలు పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు మణికిషోర్, వెంకటేశ్వరరావు, అధ్యాపకులు ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

జనార్దనస్వామి కల్యాణం

పెదపూడి: స్థానిక లక్ష్మీ సమేత జనార్దన స్వామివారి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి వెంకటగోపాలచార్యులు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు చింతపల్లి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై టి.రామకృష్ణ గురువారం తెలిపారు. వారి నుంచి రూ.1,420 స్వాధీం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

28న విగ్రహాల ప్రతిష్ఠాపన

కడియం: మండలంలోని వీరవరంలో పునర్నిర్మించిన ఆలయంలో హనుమ లక్ష్మణ సీతా సమేత కోదండ రామస్వామి, వేంకటేశ్వరస్వామివార్ల నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన ఈనెల 28వ తేదీన జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. గ్రామస్తులు, భక్తుల సహకారంతో ఆలయాన్ని ఇటీవల సర్వాంగ సుందరంగా పునర్నిర్మించారు. ఈనెల 26 నుంచి ప్రతిష్ఠాపనా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 28 ఉదయం 9.38 గంటలకు విగ్రహాల ప్రతిష్ఠ, అనంతరం అన్నసమారాధన నిర్వహించనున్నారు.

మేడే స్థూపాలను తొలగించడం హాస్యాస్పదం

ప్రకాశం నగర్: నగరంలోని పలు డివిజన్లలో ఉన్న మేడే స్థూపాలను తొలగించడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. ఆ పార్టీ సహాయ కార్యదర్శి కె.రాంబాబు అధ్యక్షతన గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విస్తృత సమావేశం నిర్వహించారు. మధు మాట్లాడుతూ సుత్తి కొడవలి అనేది ప్రపంచ కార్మికులారా ఏకం కండి అని తెలియజేసేది తప్ప అది ఎన్నికల గుర్తు కాదన్నారు. మేడే స్థూపాలను తొలగించవద్దని అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సిటీ ఎమ్మెల్యేగా భరత్‌రామ్ గెలుపు ఖాయం

రాజమహేంద్రవరం సిటీ: నగరం అభివృద్ధికి ఎంపీ భరత్‌రామ్ ఎంతో కృషి చేశారని, రాబోయే ఎన్నికల్లో సిటీ ఎమ్మెల్యేగా ఆయనను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు కడలి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువార ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించారన్నారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఇంకా అభ్యర్థులనే ఎంపిక చేయలేకపోయాయన్నారు. సిటీ ఎమ్మెల్యేగా మార్గాని భరత్‌రామ్ 50 వేలకు పైగా మెజారిటీతో విజయం సాధిస్తారన్నారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రి పనిచేసిన చంద్రబాబు నాయుడు ప్రజలను ఎలా మోసం చేశారో అందరికీ తెలుసునన్నారు. సమావేశంలో నందం స్వామి, గుత్తుల భాస్కర్, పీతా రామకృష్ణ, సోడదాసి సుందర్ సింగ్, ఉల్లూరి రాజు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఎంపీ భరత్‌రామ్ కృషి అభినందనీయం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి ఎంపీ మార్గాని భరత్‌రామ్, మార్గాని నాగేశ్వరరావు చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పొడుగు శ్రీను కొనియాడారు. ఆయన గురువారం మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు కమ్యూనిటీ హాలు నిర్మించుకునేందుకు 15 సెంట్లు స్థలం ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. నగరాభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి భరత్‌రామ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ మేరకు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి విడుదలైన జీఓపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ధవళేశ్వరం రవిశంకర్, అనుపోజు రమణ, కొమ్మోజు దుర్గారావు, స్వర్ణకార సంఘం నగర అధ్యక్షుడు గండేబత్తుల శ్యామ్ పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాలు నిర్మాణానికి విడుదలైన జీఓతో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

చేపల మార్కెట్‌లో దళారుల నుంచి కాపాడండి

రాజమహేంద్రవరం సిటీ: జాంపేట చేపల మార్కెట్‌లో దళారులుగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులు పెడుతున్న కోటేశ్వరరావు, రమేష్ నుంచి కాపాడాలంటూ మత్స్యకార మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చేపలు అమ్ముకుంటూ, కోసుకుంటూ జీవనం సాగిస్తున్న తమను దళారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్నారు. వేరే సామాజిక వర్గానికి చెందిన వారు తమపై ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. నిత్యం తమను డబ్బు కోసం వేధిస్తున్నారని, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. మత్స్యకారులమైన తాము వేటకు వెళ్లి చేపలు పట్టి తెచ్చి మార్కెట్‌లో విక్రయిస్తామన్నారు. గోదావరి బెస్త మహిళా సహకార సంఘం అధ్యక్షురాలు వెలమ లక్ష్మి మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కోటేశ్వరరావు, రమేష్‌లపై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మూడు సంఘాలకు చెందిన మత్స్యకార నాయకులు కంచి ప్రభాకరరావు, లోవి మరిడియ్య, సామల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మత్స్యకార మహిళలు

కేసు పెట్టే ప్రయత్నం విరమించాలి

ప్రకాశం నగర్: సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు, పార్టీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వల రాంబాబుపై బైండ్ ఓవర్ కేసు పెట్టే ప్రయత్నాన్ని విరమించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలతను ఆ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఎన్నికల నేపథ్యంలో ఇటువంటి నిర్బంధం సరికాదని, తక్షణమే కలెక్టర్ జోక్యం చేసుకొని ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరగకుండా చూడాలని కోరారు.

పాడికి జీవం.. పల్లె వికాసం

- ప్రభుత్వ ప్రోత్సాహంతో మెరుగైన ఫలితాలు
- పల్లెల్లో క్షీర విప్లవం

మధురపూడి: వ్యవసాయం, పాడి పరిశ్రమ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. అన్నదాతలకు అన్ని విధాలా అండగా ఉంటూ అనేక పథకాలు అమలు చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తు నుంచి పంట విక్రయం వరకూ సాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి కార్యాచరణ రూపొందించారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పాల శీతలీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామీణ మహిళలను పాడి రైతులుగా తీర్చిదిద్ది, మహారాణులను చేసే ప్రక్రియ ప్రారంభమైంది. గుజరాత్‌లో అమూల్ సహకార డెయిరీ ఆధ్వర్యంలో పాడి రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు. అదే నమూనాతో రాష్ట్రంలో మహిళా పాల రైతులతో సహకార సంఘాలు ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టారు. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో గల 69 గ్రామాల్లో 19,565 ఆవులు, 44,076 గేదెలున్నాయి.

రెండు బల్క్‌మిల్క్ సెంటర్ యూనిట్ల ఏర్పాటు

రాజానగరం నియోజకవర్గంలోని జంబూపట్నం, భూపాలపట్నం గ్రామాల్లో బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లు (బీఎంసీయూ) ఉన్నాయి. వీటి పరిధిలో 92 గ్రామాలున్నాయి. ఇక్కడి నుంచి ప్రతి రోజూ 3,575 లీటర్ల పాలను సేకరించి, బీఎంసీయూలకు చేర్చుతున్నారు. అక్కడ పాల శీతలీకరణ జరుగుతోంది. అక్కడ యంత్రాల ద్వారా ఎస్ఎన్ఎఫ్, వెన్న శాతాన్ని పరిగణిస్తారు. తద్వారా పాలకు మంచి ధర అందుతుంది.

ఆదాయం పెరిగేలా..

జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ద్వారా పాడి రైతులకు ఆదాయం పెరుగుతోంది. పాల దిగుబడితో పాటు నాణ్యతను పెంచడానికి పాలవెల్లువ కేంద్రాలు దోహదపడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు సంకల్పయాత్రలో పాడి రైతులకు ఇచ్చిన హామీ మేరకు పాలవెల్లువ కార్యక్రమం చేపట్టారు. పాలలోని వెన్న, ఎస్ఎన్ఎఫ్ ఆధారంగా రైతులు ధరను పొందుతారు.

పాల ధరలు ఇలా.. : గేదె పాలలో ఎస్ఎన్ఎఫ్ 8.7, వెన్న 5.5 శాతానికి తగ్గకుండా ఉంటే లీటర్‌కు రూ.40, అలాగే వెన్న 13, ఎస్ఎన్ఎఫ్ 9కి తగ్గకుండా ఉంటే లీటర్‌కు రూ.102 అందిస్తారు. ఆవుపాలలో ఎస్ఎన్ఎఫ్ 8.3, వెన్న 3.2 శాతానికి తగ్గకుండా ఉంటే లీటర్ రూ.34, అలాగే వెన్న 5.4 శాతానికి, ఎస్ఎన్ఎఫ్ 8.7 శాతానికి తగ్గకపోతే రూ.45 ఇస్తారు.

దిగుబడి పెంపు

పాడి పశువుల సంరక్షణలో భాగంగా సమీకృత దాణా, నాణ్యమైన మేపును పశువులకు అందించాలి. మంచి పశుగ్రాసం, దాణాను ఇవ్వడం ద్వారానే పాల ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది.




జంబూపట్నం బీఎంసీయూను పరిశీలిస్తున్న అధికారులు

ఆదాయ వనరు

జంబూపట్నం బీఎంసీయూకు పాల సేకరణ వేగవంతంగా జరుగుతోంది. అమూల్ సహకార సంస్థతో కలిసి నిర్వహించే జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ద్వారా పాడి రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఎస్ఎన్ఎఫ్, వెన్న శాతం తగినంత ఉంటే మంచి ధరను పొందవచ్చు. దానికి అనుగుణంగా సమీకృత దాణా, మంచి పశుగ్రాసాన్ని పశువులకు అందించాలి. వేసవి నేపథ్యంలో పశువుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

– పి.ప్రభావతి, పశుసంవర్థక శాఖ ఏడీ

సినిమాలు



శ్యామల భీమా
సూర్యమినీ : మడ్గాన్ ఎక్స్‌ప్రెస్ (హిందీ)
సూర్యప్యాలెస్ : నువ్వు–నేను, కుంగ్‌ఫూ పాండా – 4
స్వామి : ఓంభీమ్‌బుష్...
శివజ్యోతి : ఓంభీమ్‌బుష్...
అనుశ్రీ : ప్రేమలు
రాజా : లైన్‌మెన్
ఊర్వశి : లైన్‌మెన్, రజాకార్
రంభ : తంత్ర
మేనక : యమధీర, పక్కిరి
అప్సర : గామి
కుమారి : ప్రేమలు

నామవరం
వీఎస్ మహల్ : ఓంభీమ్‌బుష్...

ధవళేశ్వరం
మురళీకృష్ణ : ఓంభీమ్‌బుష్...

కడియం
వెంకటసూర్య : ఓంభీమ్‌బుష్...